ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 15 నవంబరు 2024



నేడు జన్ జాతీయ గౌరవ దివస్

పార్వతీపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం జన్ జాతీయ గౌరవ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గురువారం ఆయన చాంబర్‌లో అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ఎన్నిక కోడ్ ఎత్తివేసినందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఈ వేడుకలు జరపాలని నిర్ణయించినట్టు తెలిపారు. గిరిజన స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సాముండా జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించనున్నట్టు చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, అటవీ, వైద్య ఆరోగ్యశాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



సీతంపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన

ఘనంగా బాలల దినోత్సవం

సీతంపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. బాలల హక్కులను రక్షిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని, నేటి బాలలే రేపటి పౌరులని, వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనదేనని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు 'బాలల దినోత్స వం' అక్షర రూపంలో కూర్చున్నారు. ఈ ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది.



పోసాని కృష్ణమురళీపై పోలీసులకు ఫిర్యాదు

పాలకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళీపై టీడీపీ నేతలు గురువారం పాలకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు అసభ్యకర పదజాలంతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ ప్రయోగమూర్తిని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నేతలు బోగాది వెంకటరమణ, అనాపు జవరాజు తదితరులు ఉన్నారు.

ప్రాథమిక రంగం

వృద్ధి సాధించాలి

- 2వేల ఎకరాలు నిమ్మగడ్డి పెంచాలి
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాథమిక రంగాలైన వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్థక, మత్స్య, అటవీ తదితర శాఖలకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించి వృద్ధి సాధించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం ప్రైమరీ సెక్టారు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2 వేల ఎకరాల్లో నిమ్మగడ్డి పెంచేలా లక్ష్యాలు నిర్దేశించుకోవాలన్నారు. ఉద్యానపంటల్లో జిల్లా దిగువ స్థాయి నుంచి పైస్థాయికి వచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. గుంబూషియా చేపలు పెంచేందుకు ఆదర్శవంతమైన పార్క్ సిద్ధం చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో మొక్కలు పెంచే కార్యక్రమం ఉందని, అందుకు మొక్కలను సిద్ధం చేయాన్నారు. జిల్లాలో పాలు, మాంసం విక్రయాలు మరింత పెరగాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖాధికారి ప్రసూన, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా ఉద్యానవన అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవలు అందించాలి

జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ వసతి గృహాల్లో సేవలు అందించి, స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్షించారు. సాంకేతిక విద్య, పరి శ్రమల శిక్షణ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ వసతిగృహాల్లో సేవలు అందించడం వల్ల వారికి ప్రాజెక్టు వర్క్‌గా ఉపయోగడుతుందన్నారు. తద్వారా హాస్టళ్లలో వసతులు కూడా మెరుగుపడతాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఇందుకు అవసరమైన సామగ్రిని అందిస్తామన్నారు. విద్యార్థులు వారికి దగ్గరలో ఉన్న వసతి గృహాలను సందర్శించి, వారు నేర్చుకున్న పనులు చేపడితే సరిపోతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మంజుల వీణ, తదితరులు పాల్గొన్నారు.

22న ప్రతిభ పరీక్ష నిర్వహించాలి

మై స్కూల్, మై ప్రైడ్‌లో భాగంగా ప్రభుత్వ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 22న ప్రతిభ పరీక్ష నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఈవోలు, తహసీల్దార్లతో సమీక్షించారు. ప్రతిభ పరీక్ష ప్రశ్నాపత్రం వాట్సాప్‌కు పంపి స్తామన్నారు. ఏకకాలంలో ఈ పరీక్ష జరగాలని, అందులో అన్ని సబ్జెక్టులు ఉంటాయన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి ఆంగ్ల భాషలో పది పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. అపార్ కార్డులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, ఇందుకు ఆధార్ కేంద్రాలను ఉపయోగించుకోవాలని అన్నారు.

విద్యార్థుల బంగారు భవిత కోసం..


- రక్తహీనత నివారణకు సరికొత్త కార్యక్రమం
- త్వరలో పాఠశాలల్లో అమలుకు శ్రీకారం
- సన్నాహాల్లో అధికారులు

6లో



ఏదో అనుకుంటే.. ఇంకేదో అయింది

- రఘురాజుపై కక్షసాధించేందుకు చూసిన వైసీపీ
- ఎమ్మెల్సీగా అనర్హత వేటు వేయించిన వైనం
- హైకోర్టు తీర్పుతో ఉప ఎన్నికను రద్దుచేసిన ఈసీ
- జిల్లాలో నడుస్తున్న గందరగోళానికి తెర



వైసీపీ వ్యూహం బెడిసికొట్టింది. ఇందుకూరి రఘురాజుపై కక్ష సాధించేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. స్థానిక సంస్థల ఉప ఎన్నిక జరుగుతుందన్న ఆశతో అభ్యర్థిని ప్రకటించింది. అంతటితో ఆగకుండా నామినేషన్ పత్రాలను దాఖలు చేయించింది. స్థానిక సంస్థల్లో ఓట్లన్నీ వైసీపీకే అనుకూలంగా ఉన్నాయంటూ ధీమా వ్యక్తం చేసింది. అధికార కూటమి నేతల నుంచి ఓట్లను లాగేందుకు క్యాంప్ రాజకీయాలు చేసేందుకూ సిద్ధపడుతున్న తరుణంతో హైకోర్టు ఝలక్ ఇచ్చింది. ఉప ఎన్నిక రద్దు చేయాలని తీర్పునిచ్చింది. తాజాగా కేంద్ర ఎన్నికల కమిషన్ కూడా తీర్పును ధ్రువీకరిస్తూ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను రద్దుచేసింది. దీంతో వైసీపీకు తెరుకోలేని దెబ్బతగిలినట్లయింది.

పార్వతీపురం/విజయనగరం/శృంగవరపుకోట నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నియోజకవర్గంలో 2019లో పార్టీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు గెలుపునకు కృషి చేశారని 2021లో రఘురాజుకు జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీ పదవిని నాటి వైసీపీ ప్రభుత్వం కట్టబెట్టింది. అయితే ఎమ్మెల్సీగా బాధ్యతలను స్వీకరించిన ఏడాదిలోపే స్థానిక ఎమ్మెల్యేతో విభేదాలు తలెత్తాయి. నియోజకవర్గంలో తన వర్గానికి అన్యాయం జరుగుతోందని రఘురాజు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడుబండికి టిక్కెట్ ఇవ్వొద్దంటూ ఇతని వర్గం డిమాండ్ చేసింది. అధిష్ఠానం మాత్రం కడబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇవ్వడంతో రఘురాజు వర్గీయులంతా ఇతని భార్య సుధారాజు (సుబ్బలక్ష్మి) ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీలో చేరిపోయారు. రఘురాజు మాత్రం వైసీపీలో ఉండిపోయారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు అతన్ని ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పించేందుకు వ్యూహం రచించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అప్పటి శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్‌తో ఫిర్యాదు చేయించారు. వెంటనే మండలి చైర్మన్ మోసన్ రాజు ఈఏడాది జూన్ 3న అనర్హత వేటు వేసేశారు. దీన్ని రఘురాజు హైకోర్టులో సవాల్ చేశారు. కోర్టులో వాజ్యం నడుస్తోంది. మరో రెండు రోజుల్లో తీర్పు వస్తుందనగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ఇచ్చింది. ఈ నెల 4న నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అంతే వైసీపీ ఈ ఎమ్మెల్సీ పదవిని దక్కించు కొనేందుకు వ్యూహరచనలకు దిగింది. బొబ్బిలి మాజీ శాసన సభ్యుడు శంబంగి వెంకట చినప్పలనా యుడుకు టిక్కెట్టు ఖరారు చేసింది. అంతలో హైకోర్టు నుంచి రఘురాజుకు అనుకూలంగా తీర్పురావడంతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్సీ పోటీకి ఎవరినీ రంగంలోకి దించలేదు. హైకోర్టు తీర్పుతో ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను రద్దుచేస్తుందని ముందే ఊహించింది. అయితే ఈసీ నిర్ణయం ప్రకటించడంలో ఆలస్యంగా జరగడంతో ఎన్నికల క్రతువు అలాగే సాగింది. ఎందుకైనా మంచిదన్న నిర్ణయంతో రఘురాజు భార్య ఇందుకూరి సుబ్బలక్ష్మి (సుధారాజు), ఇతని వర్గానికి చెందిన కారుకొండ వెంకటరావులు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు నామినేషన్ లు వేశారు. వాటి పరిశీలన కూడా పూర్తయింది. అంతలో అందరూ ఊహించినట్లే ఎన్నికల సంఘం ప్రకటన వెలువడింది. ఉప ఎన్నిక షెడ్యూల్‌ను రద్దు చేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. మొత్తానికైతే రఘురాజు ఎమ్మెల్సీగా 2027 సెప్టెంబరు వరకూ కొనసాగనున్నారు.

న్యాయం గెలిచింది..

నాపై కక్ష కట్టి వైసీపీ నాయకులు, మండలిలో నాపై ఫిర్యాదు చేసి, చైర్మన్‌తో అనర్హత వేటువేయించారు. కనీసం నా వాదన కూడా వినలేదు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. పూర్తి వివరాలు విన్న తరువాత వైసీపీ వాదనలను కోర్టు కొట్టేసింది. గురువారం ఈసీ కూడా ఉప ఎన్నికలు రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో న్యాయమే గెలిచినట్లు అయ్యింది. ఇదివరకు మాదిరిగా ఎమ్మెల్సీగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాను. ప్రజలకు అందుబాటులో ఉంటాను.

- ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక రద్దు: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఉప ఎన్నికను ఎన్నికల కమిషన్ రద్దు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి.. కలెక్టర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఉప ఎన్నికకు ఈనెల 4న నోటిఫికేషన్ వెలువడినప్పటికీ ఎమ్మెల్సీగా ఉన్న ఇందుకూరి రఘురాజు హైకోర్టును ఆశ్రయించాక కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈసీ నోటిఫికేషన్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. దీంతో ఉప ఎన్నిక రద్దు అయిందని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు.

మొదలుకానున్న అభివృద్ధి పనులు

ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఈ నెల 2న నోటిఫికేషన్ విడుదలైంది. అప్పటి నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలవుతుంది. దీనివల్ల అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ముఖ్యంగా పల్లె పండగా కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కొత్త పనులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి మంత్రి సంధ్యారాణితో పాటు ఎమ్మెల్యేలు, విజయచంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ శంకుస్థాపనలు ముమ్మరంగా చేపడుతున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో వాటికి బ్రేక్ పడింది. తాజాగా, ఎన్నికల నోటిఫికేషన్ రద్దు కావడంతో కోడ్ కూడా ఎత్తేసినట్లే. దీంతో జిల్లాలో శంకుస్థాపనలు, అభివృద్ధి పనులు మళ్లీ ప్రారంభంకానున్నాయి.

సాయికుమార్.. ప్రాణదాత

- తాను మరణిస్తూ నలుగురికి బతుకు
- గ్రీన్ చానల్ ద్వారా అవయవాల తరలింపు
- పుట్టెడు బాధలోనూ సమ్మతించిన తల్లిదండ్రులు

ఓ యువకుడు తను చనిపోతూ నలుగురి ప్రాణాలు నిలిపాడు. అవయవదానం చేసి అమరుడయ్యాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. యువకుని అవయవాలను దానం చేయడానికి అంగీకరించిన తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి (తిరుమల మెడికవర్ ఆసుపత్రి) వద్ద బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రీన్‌చానల్ ద్వారా ఆ యువకుని అవయవాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.



సాయికుమార్ అవయవాలను గ్రీన్‌చానల్ ద్వారా తరలిస్తున్న దృశ్యం

విజయనగరం రింగురోడ్డు/పాచిపెంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయికుమార్(22) ఈనెల 12న రాత్రి మోటారుసైకిల్‌పై ఇంటికి వస్తూ మక్కువ మండలం మార్కొండపుట్టి-సరాయివలస మధ్య వాహనం అదుపుతప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వచ్చి సాయికుమార్‌కు సపర్యలు చేసి తల్లిదండ్రులు లక్ష్మణరావు, శ్రీదేవిలకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి (తిరుమల మెడికవర్ ఆసుపత్రి)కి తరలించాలని సూచించారు. అదేరోజు రాత్రి విజయనగరం తీసుకొచ్చారు. అప్పటి నుంచి వైద్యులు చికిత్స అందించినా ప్రయోజనం లేకపోయింది. బుధవారం రోజంతా కోమా నుంచి బయటకు రాలేదు. వైద్యానికి సహకరించకపోవడంతో వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించి విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. తనయుడు దక్కడన్న వార్తను జీర్ణించుకోలేక వారు గుండెలవిసేలా విలపించారు. వారిని వైద్యులు, బంధువులు ఓదార్చి అవయవదానంపై అవగాహన కల్పించారు. అంత దుఃఖంలోనూ ధైర్యం తెచ్చుకుని అవయవదానం ద్వారా తన కుమారుని అమరునిగా చూడాలని భావించి తల్లిదండ్రులు సమ్మతి తెలిపారు. వైద్యులు పోలీసు సహకారంతో గురువారం ఉదయం గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి సాయికుమార్ కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులను పొరుగున ఉన్న విశాఖపట్నం జిల్లాకు తరలించారు. గుండెను మాత్రం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రీన్ చానల్ ద్వారా విశాఖపట్నం విమానాశ్రయానికి చేరవేసి అక్కడి నుంచి చెన్నైకు తీసుకెళ్లారు.

కుటుంబ బాధ్యతలు మోస్తున్న సాయికుమార్

సాయికుమార్ ఇంటర్ చదువుకున్నాడు. సాలూరులో బస్‌డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలను మోస్తున్నాడు. తండ్రి లంకేన లక్ష్మణరావు, తల్లి శ్రీదేవి రైతుకూలీలుగా ఉన్నారు. సాయికుమార్ చెల్లెలు స్రవంతి పాచిపెంటలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుటుంబానికి బాసటగా నిలిచిన సాయికుమార్ అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రుల రోదనకు అంతే లేకుండా ఉంది. పుట్టెడు దుఃఖంలోనూ అవయవదానం చేసేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడంపై ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. జీవన్‌ధాన్ సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కె.రాంబాబు, ఆర్డీవో దాట్ల కీర్తి, ఆసుపత్రి ఎండీ తిరుమల ప్రసాద్‌లు సాయికుమార్ తల్లిదండ్రులకు ప్రశంసాపత్రం, రూ.10వేల సాయం అందజేశారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు: ఆర్డీవో

అవయవదానం చేసిన సాయికుమార్ మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో వారి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తాం. సాయికుమార్ మరణం బాధాకరం. అయినా

(మిగతా 8వ పేజీలో)



సాయికుమార్(ఫైల్)



డ్రోన్లు వస్తున్నాయ్

● ఇక వ్యవసాయ రంగంలో వినియోగం ● సాగులో నూతన ఒరవడి ● 6 గంటల్లో 30 ఎకరాలకు పురుగు మందుల పిచికారీ

గజపతినగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి)

వ్యవసాయంలో సస్యరక్షణ ఒక ప్రధాన సమస్య ఇందులో కూలీల ఖర్చు భారీగా ఉంటుంది. జిల్లాలో అనేక నీటి వనరులు ఉన్నప్పటికీ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సస్యరక్షణకు భారీగా ఖర్చు చేసి... నలిగిపోతున్నారు. మరో వైపు కూలీల కొరత వెంటాడుతోంది. పొలం పనులకు కూలీలు రావడమే గగనంగా మారింది. దీనికి పరిష్కారంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డ్రోన్లు వినియోగించేందుకు వీలుగా పరిశోధనలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే సమాలోచనలు చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి రైతులు డ్రోన్ల వినియోగంపై పూర్తి పట్టు సాధించే దిశగా కూటమి ప్ర భుత్వం అడుగులు వేస్తోంది. కొత్త వంగడాల రూపకల్పనలో... నూతన వ్యవసాయ పనిముట్ల తయారీలో పేరుగాంచిన సాంకేతిక నిపుణుల సలహాలు... సూచనలు తీసుకొని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయంలో ఇప్పటికే రైతులకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన కింద తక్కువ ఖర్చుతో డ్రోన్లను వినియోగించి... స్వల్ప సమయంలో... ఎక్కువ విస్తీర్ణంలో పంటలకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేందుకు ప్రయోగాలు సాగుతున్నాయి.

యువతకు శిక్షణ..

డ్రోన్ల వినియోగంపై వ్యవసాయ శాఖ యువతకు శిక్షణ ఇస్తోంది. వ్యవసాయ శాఖ ద్వారా మండలాల్లో ఎంపిక చేసిన యువతకు గుంటూరు విశ్వవిద్యాలయంలో డ్రోన్ పైలెట్ల శిక్షణ ఇస్తోంది. 14 రోజుల శిక్షణలో 7 రోజులు డ్రోన్ల వినియోగం.. మరో ఏడు రోజులు పంటలకు డ్రోన్లతో మందులు పిచికారీ చేసే విధానంపై శాస్త్రవేత్తలు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన యువతకు సబ్సిడీపై డ్రోన్లు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. నిరుద్యోగ యువతకు ఇది ఒక మంచి అవకాశం.

శిక్షణతో ఉపయోగం..



డ్రోన్ల వినియోగంపై గుంటూరులోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో శిక్షణ ఇచ్చారు. 14 రోజుల శిక్షణలో 7 రోజులు డ్రోన్ వినియోగించాల్సిన తీరు... మరో 7 రోజులు పొలాల్లో మందులు ఎలా పిచికారీ చేయాలన్న అంశాలపై శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేశారు.

-కెల్ల మహేష్, కొత్తశ్రీరంగరాజపురం, గజపతినగరం మండలం

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదా..

డ్రోన్లకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వ్యవసాయ క్షేత్రాల్లో కూలీల కొరతను అధిగమించి... సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ప్రస్తుతం ఎకరాకు పురుగుల మందు పిచికారీ చేయడానికి రూ.900 నుంచి రూ. 1200 ఖర్చవుతోంది. అదే డ్రోన్‌తో అయితే ఎకరాకు రూ.500 అద్దెగా తీసుకుంటారు. డ్రోన్ వినియోగంతో ఏ సమయంలోనైనా... ఏ పంటకైనా సులభంగా పిచికారీ చేయవచ్చు. తక్కువ ఖర్చుతో అంటే ఒక కూలీకి ఇచ్చే రూ.400తో ఒక ఎకరంలో 10 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయవచ్చు. డ్రోన్లతో అన్ని రకాల పురుగు, కలుపు, ఆర్గానిక్ ద్రావణాలను పిచికారీ చేయవచ్చు. కేవలం 6 గంటల్లో 30 ఎకరాల్లో పిచికారీ చేయవచ్చునని శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైందని వ్యవసాయ ఉన్నతాధికారులు తెలియజేస్తున్నారు. సాధారణంగా ఎకరా పొలానికి పురుగు మందు పిచికారీ చేయాలంటే 200 లీటర్ల నీరు అవసరం . డ్రోన్‌తో కేవలం 10 లీటర్ల నీరు మాత్రమే సరిపోతుంది. ఏ పంట మీద అయినా సరే 2-3 అడుగుల ఎత్తులో పొలమంతా సమానంగా పిచికారీ చేయడం డ్రోన్‌తో సాధ్యమని వెల్లడైంది. 95శాతం నీటిని.. 95 శాతం సమయాన్ని.. 25-40 శాతం మందును డ్రోన్ ద్వారా ఆదా చేయవచ్చునని.. పెట్టుబడి తగ్గించుకోవచ్చని అధికారులు అంటున్నారు. మందు మోతాదు 4వవంతు తగ్గడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చునని చెబుతున్నారు. వరి పంటలో సుడిదోమ లాంటి మొండి పురుగులను డ్రోన్ పిచికారీతో సమర్థవంతంగా నివారించవచ్చు. పురుగుల మందు వాడకం వల్ల రైతుల్లో వచ్చే అనారోగ్య సమస్యలు, ఇతర దుష్ప్రభావాల నుంచి తప్పించవచ్చునని అంటున్నారు.

రైతులకు మేలు..



వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం మంచి ఫలితాలను ఇస్తోంది. దీంతో రైతులకు కూలీల బెడద తగ్గుతుంది. సమయం, డబ్బు ఆదా అవుతాయి. ప్రభుత్వం కూడా వ్యవసాయంలో పూర్తి స్థాయిలో డ్రోన్ల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది.

-కె.మహరాజన్, ఏడీఏ, గజపతినగరం

ఈ-బైకులు సూపర్

● పెరుగుతున్న వినియోగం
● ఆసక్తి చూపుతున్న కొనుగోలుదారులు





ప్రస్తుతం జిల్లాలో ఈ-వాహనాల సంఖ్య..

మోటారు సైకిళ్లు/స్కూటర్లు	3,290
త్రీవీలర్ ఆటోలు (పాసింజర్)	38
త్రీ వీలర్ ఆటోలు (గూడ్స్)	74
మోటర్రైజ్డు సైకిల్ (సీసీ 25)	143

విజయనగరం క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి)

మారుతున్న కాలానికి అనుగుణంగా వాహనాల్లోనూ... వాటిని వినియోగిస్తున్న వారి అభిరుచుల్లోనూ గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ వాహనాల (ఈవీ) జోరు పెరిగింది. దాదాపు దశాబ్దం కిందటే ఈవీల రాక ప్రారంభమైనా.. గడచిన రెండేళ్లలోనే వీటిని వినియోగించే వారి సంఖ్య పెరిగింది. ఇటీవల కాలంలో మామూలు వాహనాల విక్రయాలు తగ్గడంతో పాటు ఈవీల విక్రయాలు గణనీయంగా పెరుగుతున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాలుష్యం లేకుండా... పెట్రోలు ఖర్చు లేకపోవడంతో ఈ వాహనాలు వినియోగించే వారి సంఖ్య పెరిగింది. నగరాల్లోనే కాకుండా.. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం వీటి వినియోగం పెరుగుతోంది. దీంతో ఒకప్పుడు నగరాలకు పరిమితమైన ఎలక్ట్రానిక్ వాహనాల షోరూంలు... ఇప్పుడు మండల కేంద్రాల్లోనూ ఏర్పాటవుతున్నాయి. విజయనగరంలో ఈవీలు విక్రయించే షోరూంలు 12 ఉన్నాయి. నిత్యం ఈ షోరూంల ద్వారా వందకిపైగా వాహనాలు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. బ్యాటరీ 4 గంటలు చార్జ్ చేస్తే... 100 కిలో మీటర్లు వరకూ ప్రయాణం చేసే అవకాశం ఉంది. పెట్రోలు, డీజిల్ వాహనాలతో పోల్చితే .. నిర్వహణ వ్యయం కూడా తక్కువగా ఉండడం కలిసొచ్చే అంశం. ఆటోలు కూడా ఈ విభాగంలో పెరుగుతున్నాయి. డీజిల్, పెట్రోలు వాహనాల ధరలతో సమానంగానే వీటి ధరలు ఉన్నప్పటికీ నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండడం వీటి వైపు మొగ్గు చూపడానికి కారణమవుతోంది.



పర్యావరణానికి మేలు

ఈ వాహనాలు పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడతాయి. డీజిల్, పెట్రోలు వాహనాల కంటే ఇవి ఎంతో మేలు. వీటిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే విధంగా రవాణా శాఖ కృషి చేస్తోంది. ఆరోగ్య సమస్యలు కూడా ఈ వాహనాలతో తక్కువ. జిల్లాలో ప్రస్తుతం 12 షోరూంలు ఉన్నాయి.

-మణికుమార్, రవాణా శాఖ ఉప కమిషనర్

ఖర్చు తక్కువ

ఈ వాహనం గత ఏడాది నుంచి ఉపయోగిస్తున్నాను. ఒక్క రోజు నాలుగు గంటల పాటు చార్జింగ్ పెడితే... మూడు రోజుల వరకూ నగరంలో తిరుగుతుంటాను. ఎటువంటి శబ్ద కాలుష్యం ఉండదు. వాహనం నిర్వహణ ఖర్చులు చాలా తక్కువగా ఉంటాయి.

-ఎంపీజీ ఈశ్వరరావు

రహదారులకు మహర్దశ

● ఐదేళ్ల అక్రమాలకు మరమ్మతులు
● జిల్లాకు రూ.10.54 కోట్లు మంజూరు



కొత్తవలస మండలం కొత్తవలస- సబ్బవరం రోడ్డు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

విజయనగరం టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రహదారులకు మంచిరోజులొస్తున్నాయి. ఐదేళ్ల వైసీపీ అధ్వాన్న పాలనకు బలైన రోడ్లను మెరుగుపరచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ఐదేళ్లలో కొత్త రహదారులు ఏర్పాటు చేయలేదు. రోడ్ల మరమ్మతుల పనులకు అరకొర నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు ముందుకు వెళ్లలేని పరిస్థితి. అలాగే అత్యవసర పనుల్లో భాగంగా రోడ్ల మరమ్మతులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఐదేళ్లలో సక్రమంగా బిల్లులు చెల్లించక పోవడంతో రెండోసారి మరమ్మతులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఐదేళ్లూ జిల్లావాసులు నరకయాతన అనుభవించారు. కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే ఎన్నికల హామీల్లో భాగంగా రోడ్ల మరమ్మతులకు అత్యవసర నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 860 కోట్లు మంజూరు చేయడంతో ఈ నెల 1 నుంచి పనులు ప్రారంభం అయ్యాయి. జిల్లాకు అత్యవసర మరమ్మతుల కింద పాట్ ఫ్రీ గ్రాంట్ నుంచి రూ. 10.54 కోట్లు మంజూరు అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 73 పనులను గుర్తించి, 290 కిలోమీటర్ల పరిధిలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు. జిల్లాలో మరమ్మతులకు గురైన రహదారుల పనులు చేపట్టేందుకు అత్యవసర నిధులు పాట్ ఫ్రీ గ్రాంట్ కింద నిధులు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి తెలిపారు.



బొప్పడాం - గరివిడి రోడ్డు మరమ్మతుల పనులు చేపడుతున్న దృశ్యం

విద్యార్థుల బంగారు భవిత కోసం..

● రక్తహీనత నివారణకు సరికొత్త కార్యక్రమం
● త్వరలో పాఠశాలల్లో అమలుకు శ్రీకారం ● సన్నాహాల్లో అధికారులు



బంగారు భవిత కార్డు



పార్వతీపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్తహీనత నివారణకు జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. ప్రధానంగా పాఠశాల విద్యార్థులను ఆ ముప్పు తప్పించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఈ చర్యల్లో భాగంగా గత నెలలో 'బంగారు భవిత' పేరిట కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని అమలుకు క్షేత్రస్థాయి సిబ్బంది పక్కాగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రక్తహీనతతో బాధపడు తున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి.. మెరుగైన వైద్యసేవలు, పౌష్టికాహారం అందించనున్నారు. వాస్తవం గా జిల్లాలోని 15 మండలాల్లో 187 హైస్కూళ్లు ఉన్నా యి. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువు తున్న విద్యార్థుల వివరాలను ముందుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఆ తర్వాత విద్యార్థులకు బంగారు భవిత పేరిట ఒక కార్డును అందించనున్నారు. ఇందులో వారి ఆరోగ్య వివరాలు ఉంటాయి. జిల్లాలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 49,836 మంది విద్యార్థులు చదువుతుండగా.. వారిలో 20 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్టు ప్రాథమిక అంచనా. ఈ సంఖ్య మరింత పెరగకుండా ఉండేందుకు అధికారు లు చర్యలు చేపట్టనున్నారు. విద్యార్థుల ఆరోగ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ.. రక్తహీనత నివారణకు కృషి చేయనున్నారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న వారికి ఐరన్ ఎక్కువగా లభించే ఆహార పదార్థాలు అందించనున్నారు. మధ్యాహ్న భోజనంలో రాగిజావ, గుడ్డు, చిక్కీలు అందజేయనున్నారు. ఇంటిలోనూ గుడ్లుతో పాటు బెల్లంతో చేసిన ఆహార పదార్థాలను పిల్లలకు అందించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. రోజూ పిల్లలకు ఉపాధ్యాయుల ద్వారా రెండు ఐఎఫ్ఏ టాబ్లెట్స్ ఇవ్వనున్నారు. అదే విధంగా నులిపురుగుల నివారణకు ఆరు నెలలకొకసారి ఆల్‌బెండాజోల్ మాత్రలు అందించనున్నారు. ఈ విధంగా బంగారు భవిత ద్వారా విద్యార్థులకు ఆరోగ్యాలకు భరోసా కల్పించనున్నారు. త్వరలో ఈ కార్యక్రమం జిల్లాలో అన్ని పాఠశాలలో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎంతో ఉపయోగం..

బంగారు భవిత కార్డులు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయి. ఈ కార్డులో విద్యార్థుల వ్యక్తిగత వివరాలతో పాటు ఆరోగ్య వివరాలు ఉంటాయి. వీటి ఆధారంగా వారికి అవసరమైన మందులు, పౌష్టికాహారం అందిస్తాం. ఇప్పటికే ఈ కార్డులను వారికి పంపిణీ చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నాం.

-ఎస్.తిరుపతినాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

భళా.. బాలకా!

విజయనగరంలోని గురజాడ స్మారక కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. చిన్నారులు జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో ఆకట్టుకున్నారు. వారిని కలెక్టర్ అభినందించారు.





అసెంబ్లీలో మన ఎమ్మెల్యేలు

చంద్రబాబు విధానాలతోనే రాష్ట్రం అగ్రగామి..

● శాసనసభలో ఎమ్మెల్యేలు విజయచంద్ర, కోండ్రు మురళీమోహన్



అసెంబ్లీలో మాట్లాడతున్న ఎమ్మెల్యేలు విజయచంద్ర, కోండ్రు మురళీమోహన్

పార్వతీపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన విధానంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచేందుకు అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ఫార్మా ప్రొడక్షన్ కంపెనీలను రూపింగ్ చేయడం అద్భుతమన్నారు. ప్రభుత్వం చూపుతున్న చొరవ నిరుద్యోగులకు వరంగా మారుతుందన్నారు. సర్వీస్ సెంటర్ ట్రాన్స్‌పర్ సెక్టార్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎక్కువగా ఆధారపడి ఉంటున్నారని వివరించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు కూడా రాష్ట్ర అభివృద్ధికి, నిరుద్యోగ నిర్మూలనకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆటిజం వ్యాధి లక్షణాలు, దానివల్ల వచ్చే ఇబ్బందులపై తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిత కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని విన్నవించారు.

● రాజాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించి 22ఏ జీవో కారణంగా బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అసెంబ్లీలో ప్రస్తావించారు. డీ పట్టాల విషయంలో బలహీన వర్గాలకు ఉపయోగపడే విధంగా చట్టాలు లేవన్నారు. కేవలం అధికారం ఉన్నవారికి మాత్రమే ఇవి ఉపయోగపడుతున్నాయని తెలిపారు. రాజాంలోని వినాయక నగర్ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించారు. 22ఏ సమస్యతో బ్యాంకు లోన్లు అందక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఉత్సాహంగా బాలల దినోత్సవం



నెల్లిమర్ల: సతివాడ ఆదర్శ పాఠశాలలో చిన్నారుల నృత్యాలు

జిల్లా వ్యాప్తంగా వివిధ స్వచ్ఛంద సంస్థలు...ప్రభుత్వ కార్యాలయాలు.. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ సేవలను కొనియాడారు. చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి...విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారులు విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

-ఆంధ్రజ్యోతి బృందం



వంగర: సమర యోధుల వేషధారణలో విద్యార్థులు



ఎస్.కోట: దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు



రాజాం రూరల్: చిన్నారుల నృత్య ప్రదర్శన

న్యూస్ బాక్స్

ధర్మరక్షా దినోత్సవం

బొబ్బిలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పక్కి గ్రామంలోని శివాలయంలో గురువారం సమరసతసేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ ధూపం వాసు ఆధ్వర్యంలో ధర్మ రక్షాదినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ నరసింగరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

శృంగవరపుకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. బ్యాడ్మింటన్‌లో వి.రాము, జస్వంత్, తేజ, శ్రీనిధి, వి.లక్ష్మణ్, ఎల్.శశి, మాధురి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. వీరందరికీ ధ్రువపత్రాలు అందించి నట్టు పీడీ లక్ష్మణరావు తెలిపారు. హెచ్‌ఎం జగదీశ్వరరావు, ఉపాధ్యాయుడు రామకృష్ణ విద్యార్థులను అభినందించారు.

స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

రేగిడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవుదళ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి పాడి ధనంజయ్ అండర్-19 బోయ్స్ స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటాడు. ఇటీవల శ్రీకాకుళం కెఆర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కోటి చక్రధర్ గురువారం విలేకరులకు తెలిపారు. ధనుంజయ్‌ను హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. దేవుదళ హైస్కూల్‌కు చెందిన 160 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థి కెంబూరు రమణ మూర్తి సోదరులు రూ.లక్ష విలువ చేసే క్రీడాదుస్తులు సమకూర్చారు.

నేడు బిర్సా ముండా జయంతి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన హక్కుల కోసం పోరాడిన నాయకుడు భగవనా బిర్సా ముండా జయంతిని జన జాయితీ గౌరవ దివస్‌గా నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 10.30కు నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం క్రైం, నవంబరు 14: విజయనగరం జిల్లా పరిధిలో సెకెండ్ క్లాస్ స్పెషల్ మేజిస్ట్రేట్‌లుగా నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బార్‌లో నాన్ ప్రాక్టీసింగ్ న్యాయవాదులుగా ఉంటూ.. 45 నుంచి 65 మధ్య వయస్కులు దరఖాస్తు చేయడానికి అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 30లోగా జిల్లా కోర్టులో అందజేయాలని తెలిపారు.

పక్కాగా ఇంటింటి సర్వే

రాజాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఆదేశించారు. అంతికాపల్లి, పొగిరి గ్రామాల్లో చేపడుతున్న సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఆధార్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు

తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా గోవింద



గోవింద

గజపతినగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకులు గుంప్రోతు గోవింద తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గురువారం కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో గోవిందకు అవకాశం లభించింది. గతంలో గోవింద మండల పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. డైరెక్టర్ పదవి రావడంతో తన బాధ్యత పెరిగిందని... పార్టీకి రుణపడి ఉంటానని ఆయన తెలిపారు.

కృషికి గుర్తింపు



రవికుమార్

విజయనగరం దాసన్నపేట, నవంబరు 14: (ఆంధ్ర జ్యోతి): జనసేన పార్టీ నుంచి విజయనగరం జిల్లాలో మొట్టమొదటి నా మినేటెడ్ పదవి మిడతాన రవికుమార్‌కి లభించింది. తన కృషిని గుర్తించి జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టరుగా అవకాశం కల్పించారని రవికుమార్ తెలిపారు. అందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

శ్మశాన వాటిక పరిశుభ్రం

బొబ్బిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొల్లవీధి శ్మశాన వాటికను యువకులు శ్రమదానంతో బాగు చేసుకున్నారు. గొల్లవీధి, గౌడవీధికి చెందిన యువకులు శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలను ఎక్సవేటర్‌తో తొలగించారు.

ఎక్సైజ్ అధికారుల కొరడా



పర్మిట్ రూములను తొలగిస్తున్న దృశ్యం

రాజాం, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు కొరడా ఝుళిపించారు. మద్యం దుకాణాల వద్ద నిబంధనలు పాటించాల్సిందేనని తేల్చి చెప్పారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'బహిరంగంగా తాగేస్తున్నారు' కథనానికి స్పందించారు. రాజాం పట్టణంలోని అన్ని షాపుల వద్ద తనిఖీలు చేపట్టారు. అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. అనుమతులు లేకుండా దుకాణాల వద్ద మద్యం తాగితే షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చిరు దుకాణాల వద్ద బహిరంగంగా తాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బొబ్బిలి రోడ్డులోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం యాజమానులు ఏర్పాటు చేసిన టెంట్‌ను పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా షాపుల్లో స్టాకుతో పాటు అమ్మకాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేసినా, బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపుల వద్ద ఎవరు టెంట్‌లు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. ప్రతి షాపు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నైపుణ్య గణన సర్వే శతశాతం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి): విజయనగరం పరిధిలో ఇంటింటి నైపుణ్య గణన సర్వే శతశాతం పూర్తి చేయాలని సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నైపుణ్య గణన విషయంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వివిధ రంగాల్లో నైపుణ్యం గలిగిన, ప్రతిభ ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి మరింత మెరుగైన తర్ఫీదు ఇచ్చి ప్రోత్సాహించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వే చేపడుతున్నట్టు వెల్లడించారు. సమావేశంలో టీపీఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి



నినాదాలు చేస్తున్న 108 ఉద్యోగులు

బొబ్బిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చొరవ చూపి...108 అంబులెన్స్ వ్యవస్థను నిర్వహించాలని ఆ ఉద్యోగుల ప్రతినిధులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ ప్రతినిధులు గేదెల వేణుగోపాలనాయుడు, మండంగి శోభన్‌బాబు, కటికి మహేశ్వరరావు, రాంబార్కి రాంబాబు, బైపు అప్పారావు, పతివాడ వెంకటరమణలు మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాల ని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెకు దిగుతామని తెలిపారు. అనంతరం తహసీల్దారు మలపురెడ్డి శ్రీనుకు వినతిపత్రం అందజేశారు.

రామభద్రపురంలో..

రామభద్రపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 108 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ ఆకుల సులోచనారాణికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో రత్నంకు కూడా వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జి.ప్రభాకరరావు, బండారు సింహాచలం, జే.శంకర్, సీహెచ్.బంగారి, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

నేడు ఆకాశజ్యోతి

శృంగవరపుకోట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజీపేట వేదగాయత్రీ మాత కొలువై ఉన్న శంబలనగరి ఆశ్రమంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆకాశజ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ ఆకాశజ్యోతి కోసం 300 కేజీల నెయ్యి, 300 మీటర్ల ఒత్తి, 9 కేజీల కర్పూరం వినియోగిస్తారు. ఇది వారం నుంచి పది రోజుల పాటు వెలుగుతూ ఉంటుంది.

ఉప సభాపతికి అభినందన

శృంగవరపుకోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): శాసనసభ ఉప సభాపతిగా ఎంపికైన రఘురామ కృష్ణంరాజును గురువారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అభినందించారు. తోటి మహిళా ఎమ్మెల్యేలందరితో కలసి మర్యాదపూర్వకంగా కలిశారు.

నెహ్రూ మనకు ఆదర్శం

రామభద్రపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ మొదటి ప్రధాని నెహ్రూ దేశభక్తి, క్రమశిక్షణను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఐ వెలమల ప్రసాద్ అన్నారు. నాయుడువలస పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జేసీ రాజు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు బొప్పే రవికుమార్, రెడ్డి కృష్ణంనాయుడు, రెడ్డి వేణు, సత్యం, వెంకటరమణ, కృష్ణ, మహిళా పోలీసు మాలతి పాల్గొన్నారు.

పీఆర్ అదనపు కమిషనర్ పర్యటన

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్ గురువారం జిల్లాలో పర్యటించారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పల్లెపండుగ పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అంబేద్కర్‌ను కలిసి జిల్లాలో పల్లె పండుగ పనుల తీరుపై చర్చించారు గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ శివ ప్రసాద్‌ను కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కల్యాణ చక్రవర్తి, పాల్గొన్నారు.

అప్రమత్తతతో ఉపశమనం

కొత్తవలస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి జాగ్రత్తలతో డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వాటి నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా మలేరియా అధికారిణి వై.మణి అన్నారు. గురువారం కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీతల్ వర్మతో కలసి అప్పన్న దొరపాలెం గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో ప్రజలు జ్వరాలు, కీళ్ల నొప్పులు వంటి వాటితో బాధపడడంతో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా జ్వరాలను నియంత్రించవచ్చునన్నారు.

తూర్పు భాగవతం ప్రదర్శనకు అవకాశం

బొబ్బిలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ లార్జెస్ట్ కల్చరల్ ఫెస్టివల్ 2024 కార్యక్రమంలో కోమటిపల్లి గ్రామానికి చెందిన బొంతలకోటి శంకరరావు బృందం తూర్పు భాగవత ప్రదర్శనకు అవకాశం దక్కింది. దీనిపై శంకరరావు సంతోషం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా యువకుడి మృతి

మక్కువ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయి(22) అనుమానాస్పదంగా మృతి చెందినట్టు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనపై ఆయన గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయి అనే యువకుడు మక్కువలోని తన మేనమామ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 12న తన సొంత పనుల నిమిత్తం మక్కువ మండలంలోని దుగ్గేరు వెళ్లాడు. అయితే తిరిగి వచ్చే క్రమంలో సరాయివలస, మార్కొండపుట్టి గ్రామాల మధ్య రహదారిపై గాయాలతో అచేతనంగా పడి ఉన్న సాయిని స్థానికులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని సాయిని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తిరుమల మెడికవర్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ సాయి చికిత్స పొందుతూ ఈనెల 13న మృతిచెందాడు. దీంతో సాయి తండ్రి లంకేన లక్ష్మణరావు గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసలు అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

బెలగాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి గురువారం తీర్పు వెల్లడించారని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2019లో జియ్యమ్మవలస మండలానికి చెందిన గెంబలి దుర్గారావు అనే వ్యక్తి ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ మేరకు బాలిక తల్లి చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ శివప్రసాద్ నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టగా నేరం రుజువయ్యింది. కోర్టులో ప్రవేశపెట్టగా నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

రెండో అంతస్తు నుంచి జారి పడి మహిళ మృతి

నెల్లిమర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగుంపాం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న భవనం రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ మహిళ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొండగుంపాం గ్రామానికి చెందిన శనపతి రమణమ్మ(54) గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న తమ భవనంలో రెండో అంతస్తును నీళ్లతో తడుపుతుండగా ప్రమాదవశాత్తు కిందకు జారిపడింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఆమె కుమారుడు శనపతి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం మహారాజ ఆసుపత్రికి తరలించారు. నెల్లిమర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ దుకాణంపై దాడి

జామి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జట్టేడివలసలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై విజయనగరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై స్థానికులు మాట్లాడుతూ తమ గ్రామంలో అనధికారికంగా నాలుగు దుకాణాలు నడుస్తున్నాయని తెలిపారు. ఒక దుకాణంపై దాడి చేశారని ఈలోగా మిగతావారు అప్రమత్తమయ్యారని తెలిపారు. దీనిపైన సీఐ రాజేష్‌ను వివరణ కోరగా తమకు సమాచారం అందిందని తెలిపారు. పూర్తి వివరాలు చెప్పేందుకు సమయం పడుతుందని అన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన నిందితుడి అరెస్టు

కొత్తవలస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి గొడవకు సంబంధించి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనలో నిందితుడిని గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు. మంగళపాలెం శివారు రెల్లి కాలనీలో ఉంటున్న బంగారు రాము తన ఆరేళ్ల కుమారుడిని నరేంద్ర అనే యువకుడు కొట్టాడని గొడవపడడం... వీరి మధ్యలోకి వచ్చిన కశింకోట పెద్దఅప్పారావు మృతిచెందిన సంగతి తెలిసిందే. తన తండ్రి మృతికి బంగారు రాము కారణమంటూ కుమారుడు కశింకోట వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బంగారు రామును గురువారం కొత్తవలస కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ 14 రోజులు కస్టడీ విధించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని బలిజీపేట మండలం గలావిల్లి గ్రామ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సాకా మురళీకృష్ణని అదుపులోకి తీసుకుని 47 మద్యం సీసాలను స్వాధీనం చేసినట్టు ఎన్‌ఫోర్సుమెంటు ఇన్‌స్పెక్టరు కె.ఇందిరాదేవి తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం సీతానగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు అప్పగించామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాజశ్రీ, హెచ్‌సీలు సుదర్శనకుమార్, రాంబాబు, కానిస్టేబుల్స్ ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు. పాచిపెంట మండలం మూలవలస గ్రామ పరిధిలో నాటుసారా తయారీ కేంద్రంపై దాడి చేసి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎన్‌ఫోర్సుమెంటు ఇన్‌స్పెక్టరు ఎస్.సింహాద్రి తెలిపారు. మక్కువ మండలం నంద గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గోపాలశెట్టి శ్రీనివాస్‌ని అదుపులోకి తీసుకుని 13 సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రామారావు, హెచ్‌సీ సుదర్శనకుమార్, కానిస్టేబుళ్లు రాము, ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బొబ్బిలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు బొబ్బిలి సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. గురువారం మెట్టవలస గ్రామం వద్ద 30 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

భవిష్యత్తులో ఉపయోగపడే పరిజ్ఞానం అవసరం: ఎస్పీ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగపడే విషయ పరిజ్ఞానాన్ని అందించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. కంటోన్మెంట్‌లోని పోలీసు వేల్ఫేర్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ వకుల్ జిందాల్ అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని మెరుగుపరుచుకునే విధంగా ఉపాధ్యాయులు విద్యను అందించాలన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, డీఎస్పీ యూనివర్స్, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, ఆర్ఐలు గోపాలనాయుడు, ఆర్ .రమేష్‌కుమార్, శ్రీనివాసరావు, హెచ్ఎం సంధ్య, ఆర్ఎస్ఐలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి): నగరంలోని 11 కెవీ సబ్‌స్టేషన్ పరిధిలోనూ, ఒంటితాడి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటితాడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వీటీ అగ్రహారం, ఇండస్ట్రియల్ ఏరియా, బీసీ కాలనీ, ప్రదీప్‌నగర్, మజ్జిపేట, రొంగలివీధి, సంతోష్‌నగర్, ప్రియానగర్, దుర్గానగర్, వై.జంక్షన్, బాలాజీ మార్కెట్, కణపాక, మర్రిచెన్నారెడ్డి కాలనీ, సిక్కుల కాలనీ, రామయ్యమ్మ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. బీసీ కాలనీ, యాతపేట, జర్నలిస్టుల కాలనీ, రాజులకాలనీ, ద్వారపూడి రోడ్డు, రెవెన్యూ కాలనీ, బ్యాంకు కాలనీ, సాయికీర్తన నగర్, కామాక్షి నగర్, సాయి లలితానగర్, కేఎల్‌పురం, గుంకలాం, అయ్యన్నపేట, దుప్పాడ, జొన్నవలస, సారిక, కోరుకొండ, రాకోడు, పినవేమలి, పాల్‌నగర్, పావనీనగర్, అరుంధతి నగర్, కాంబోయివీధి, రెల్లివీధి, గణేష్‌కోవెల రోడ్డు, కంటోన్మెంట్ హోటల్ షాలిమార్ వెనుక, బ్యాంకు కాలనీ, కేఎల్‌పురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

వేపాడ పరిధిలో..

వేపాడ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వీలుపర్తి ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీలుపర్తి, వెల్దాం, దుంగాడ, బొర్రవలస, చామలాదేవి అగ్రహారం, వావిలపాడు, కడకొండ, దబ్బిరాజుపేట, చామలాపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఈఈ సురేష్‌బాబు తెలిపారు.

గంట్యాడ పరిధిలో..

గంట్యాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లకు ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న నేపథ్యంలో శుక్రవారం మండలంలోని పది గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ త్రినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొటారుబిల్లి, నరవ, నీలావతి, జగ్గాపురం, గొర్లిపేట, గొడియాడ, కిర్తుబర్తి, పెణసాం, చినమానాపురం, బుడతనాపల్లిలో సరఫరా ఉండదని తెలిపారు.

సమష్టి కృషితోనే సుందర పార్వతీపురం

● కలెక్టర్ శ్యాంప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

బెలగాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే సుందర పార్వతీపురం సాధ్యమని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ కళాశాలలోని సమావేశ మందిరంలో స్వచ్ఛ సుందర పార్వతీపురంపై రెండో రోజు అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురా న్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రణాళికా బద్ధమైన వ్యర్థాల నిర్వహణతో సంపద సృష్టించవచ్చని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కలిగించాల ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర సలహాదారు శ్రీనివాస్, అధికారులు డి.గోపాలకృష్ణ, రమేష్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలను తెలుసుకోండి



మాట్లాడుతున్న ఏఎస్పీ అంకిత సురాన

బెలగాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల చట్టాల పై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఏఎస్పీ అంకిత సురాన, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి అన్నారు. గురువారం స్థానిక డీవీఎం పాఠశాలలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. బాలలు అందరూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచు కోవాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాజలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జీసీసీలో సొసైటీ ఎన్నికలు

సీతంపేట రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సీతంపేట డివిజన్ పరిధిలోని గిరిజన సహకార సంస్థలో సొసైటీ ఎన్నికలు నిర్వహించను న్నట్లు సీతంపేట జీసీసీ బీఎం డి.కృష్ణారావు చెప్పారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 16వ తేదీన సొసైటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. అలాగే 18న నామినేషన్ల పరిశీలన, 19న ఉపసంహరణ ఉంటుందని తెలిపా రు. సొసైటీ ఎన్నికలు 25వ తేదీన జరుగుతాయని చెప్పారు. ఏకగ్రీవం అయితే 19వ తేదీన ప్రకటిస్తామని చెప్పారు. మొత్తంగా 649 మంది సభ్యులు ఈ సొసైటీ ఎన్నికల్లో పాల్గొంటారని అన్నారు. ఈ ఎన్నికలు చేతులెత్తే క్రమంలో ఎన్నుకుంటారని తెలిపారు.

నిబంధనల మేరకు సర్వే నిర్వహించాలి

గరుగుబిల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో నిబంధనల మేరకు ఉన్నతి సర్వే నిర్వహించాలని ఉపాధి ఏపీవో ఎం.గౌరీనాథ్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు గ్రామస్థాయి ఉపా ధి జాబ్‌కార్డులకు అర్హులైన వారిని గుర్తించాలన్నారు. సర్వే పూర్తయిన తదుపరి 18 నుంచి 21వ తేదీ వరకు పంచాయతీల్లో ప్రచురణ చేయా లని సూచించారు. 22న గ్రామసభ నిర్వహించి తీర్మానం చేయాలన్నా రు. మండలానికి సంబంధించి 100 రోజులు పూర్తయిన కుటుంబాలు 258 వరకు ఉన్నాయని తెలిపారు. వీరికి 90 రోజులు నుంచి 120 రోజులు వరకు శిక్షణ అందిస్తారని చెప్పారు. శిక్షణా కాలంలో వసతి సౌకర్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఈసీ ఎం.హరికృ ష్ణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

సీతానగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట మండలం సుభద్ర గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టు షాపు నుంచి 34 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఒకరిపై కేసు నమోదు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి గురువారం తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించినా, సారా అమ్మకాలు చేపట్టినా 9440902373 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

బడి తోటలతో మేలు

గరుగుబిల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బడి తోటల పెంపకంతో విద్యార్థులకు, ప్రకృతికి మధ్య అనుబంధం ఏర్పడుతుందని రాష్ట్ర రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డా.డి.పారినాయుడు అన్నారు. మండల కేంద్రంలో గురువారం మన బడి - మన తోట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పర్యావరణ అంశాలపై పోటీ లు నిర్వహించి, బహుమతులను అందించారు. ఎంఈవోలు డి.అప్పల నాయుడు, కె.కొండలరావు, సంస్థ కన్వీనర్ టి.శివాజీ పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం అందించాలి



బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారిణి స్వరూపారాణి

సాలూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల పూర్తి శ్రద్ధతో ఉండాలని మామిడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేక అధికారిణి డీడీ స్వరూపారాణి అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో ఆమె గురువారం రాత్రి మామిడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించా రు. విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. విద్యార్థులతో రక్తహీనత ఉంటే నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అనురాధ, మెట్రిన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే మద్యం షాపులు

బొబ్బిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఎక్సైజ్ సర్కిల్ పరిధి లోని నూతన మద్యం షాపులను నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేస్తు న్నామని సీఐ పామోటి చిన్నంనాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బొబ్బిలి మెయిన్ బజారులో పాత బాపూజీ కాన్వెంట్ ఎదురుగా గల భవనంలో తొలుత ఏర్పాటు చేసిన మద్యం షాపును స్థానికుల వినతి మేరకు తరలించా మన్నారు. బజారు వీధిలో వాణిజ్య కూడలిలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో మద్యం షాపును ఏర్పాటు చేశామని చెప్పారు. వైన్ షాపు ను ఎక్కడ పెట్టినా అభ్యంతరాలు ఉంటాయని, కొద్దిపాటి ఇబ్బంది ఉన్న ప్రాంతాలలో అనుమతి ఇస్తున్నామని తెలిపారు.

మైనింగ్ తవ్వకాలు ఆమోదమే

● మైత్రీ కంపెనీకి మద్దతుగా భారీ ర్యాలీ

ఒడిశా

రాయగడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయగడ జిల్లా కాశీపూర్ సమితి, కలాహండి జిల్లాకు చెందిన వేలాది మంది గిరిపుత్రులు, ఆదివాసీలు మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి మద్దతుగా గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. కొరాపుట్ కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ పారుల్ పట్వారీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో ఉన్న సిజిమాలి పర్వతాలపై తవ్వకాలకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, తమ సమ్మతి మేరకు ప్రభుత్వం తవ్వకాలకు అనుమతిచ్చిందని స్పష్టం చేశారు.

రోడ్డుపైనే నిరీక్షణ

● బస్సు షెల్టర్ లేక విద్యార్థుల అవస్థలు

వీరఘట్టం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అదొక మండల కేంద్రం.. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రాంతం.. అయినా బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం కనీసం బస్సు షెల్టర్ లేని పరిస్థితి. దీంతో ప్రతిరోజు రాకపోకలు సాగించే కళాశాలల విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇదీ వీరఘట్టం పరిస్థితి. విద్యార్థులు బస్సుల కోసం రోడ్డుపైనే ఎండలో వేచి చూడాల్సి వస్తోంది. బస్సుల షెల్టర్ నిర్మించాలని వారంతా కోరుతున్నారు.



బస్సు షెల్టర్ లేక రోడ్డుపై నిల్చొని ఎదురు చూస్తున్న విద్యార్థులు

గిరిజన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● ఏఎస్పీ దిలీప్‌కిరణ్

సీతంపేట రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గిరిజ నుల కోసం రూపొందించిన చట్టాలు, హక్కులపై ప్రతిఒక్క రూ అవగాహన పెంచుకోవాలని సీఐడీ ఏఎస్పీ దిలీప్‌కిరణ్ అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సీఐడీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ తెగల అత్యాచార నిరోధక చట్టం(పీవోఏ)పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఆయన హాజరయ్యారు. దీనికి ముందు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను రక్షించేందుకు రాజ్యాంగంలో ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ఈ చట్టాలు తెలిసి తప్పు చేసినా, తెలియ క తప్పు చేసినా పీవోఏ చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించిన అంశాలపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించి బహు మతులు అందజేశారు. ఈ వర్క్‌షాప్‌లో విశా ఖపట్నం సీఐడీ డీఎస్పీ ఎంఎన్ భూపాల్, పాల కొండ డీఎస్పీ రాంబాబు, శ్రీకాకుళం జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.రఘురాం, తహసీల్దార్ అప్పలరాజు, ఏటీ డబ్ల్యూవో మంగవేణి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరా వు, ఏజేఏసీ అధ్యక్షుడు బిడ్డిక శ్రీనివాసరావు, సీఐడీ ఇన్‌స్పె క్టర్ బి.చలపతిరావు, జేఏసీ నాయకుడు బి.ఉమా మహేశ్వర రావు, ఎస్ఐ అమ్మన్నరావు, సీఐడీ సిబ్బంది ఎన్.వేణుగోపా లరావు, సీహెచ్ రుద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఏఎస్పీ దిలీప్‌కిరణ్

17న జిల్లా ర్యాంకింగ్ చెస్ పోటీలు

పార్వతీపురంటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్ట ణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 17వ తేదీన మన్యం జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలు నిర్వ హిస్తున్నట్టు నిర్వాహకుడు వి.వెంకటేష్ గురువారం తెలి పారు. అండర్ 6, 8, 10, 12, 14, 16 విభాగాల్లో బాలబాలి కలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఆదివా రం ఉదయం 8 గంటలకు విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరా రు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పోటీదారులు నిర్ణీత ప్రవేశ రుసుం చెల్లించి శనివారం సాయంత్రంలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 62812 95572 నంబరును సంప్రదించాలన్నారు.

ఒక్క రోజులో రూ.లక్షా 20వేలు వసూలు

సాలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న పెద్దబజార్ షాపులు నుంచి గురువారం ఒక్క రోజే రూ.లక్షా 20వేలు అద్దె బకాయిలు వసూలు చేసినట్టు కమిషనర్ సత్యనారయణ తెలిపారు. పెద్ద బజార్‌లో ఉన్న లీజుదారులు తక్షణమే పెండింగ్‌లో ఉన్న షాపుల లీజులు బకాయిలు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రమించే వారికి తగిన గుర్తింపు

గరుగుబిల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో శ్రమించే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు అన్నారు. గురువారం నాగూరులో ఆయన మాట్లాడారు. అంకితభావంతో పనిచేసినందుకు గుర్తించి రాష్ట్ర స్థాయి డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, సి.సంధ్యారాణి, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పి.శ్రీనివాస్, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బెలగాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాల, కళాశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదివాసీ జేఏసీ నాయకుడు దుక్క సీతారాం కోరారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇటీవలె అనారోగ్యంతో గిరిజన విద్యార్థులు మరణిస్తున్నారని, వారి ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటీడీఏ పీవో ప్రత్యేక చర్యలు తీసుకుని గిరిజన విద్యార్థుల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలన్నారు.

పని భారం తగ్గించాలి

బలిజిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని ఆ సంఘ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అరసాడ పీహెచ్‌సీ వైద్యురాలు శివగాయత్రీకి వినతి పత్రం అందించారు. ఆశ వర్కర్లకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. పనిభారం తగ్గించాలన్నారు. ఈనెల 18న పార్వతీపురంలో జరిగే కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యురాలికి వినతిపత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు

సాయికుమార్.. ప్రాణదాత

(మొదటిపేజీ తరువాయి)

అవయవదానం చేసి మరో నలుగురికి సాయపడడం గొప్ప విషయం. అందుకు తల్లిదండ్రులు సమ్మతించడం అభినందనీయం.

మరో నలుగురికి వెలుగునిస్తాడని..

చేతికి అందొచ్చిన ఒక్కగానొక్క కొడుకు ప్రమాదంలో మరణించడం తో చాలా బాధగా ఉంది. తమను బాగా చూసుకుంటాడని అనుకున్నాం. కొడుకు లేడన్న విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నాం. ఈ సమయంలోనే అవయవ దానం గురించి అధికారులు, వైద్యులు చెప్పడంతో ఇద్దరం కలిసి సమ్మతించాం. మరో నలుగురి జీవితాలను మా బిడ్డ నిలుపుతాడని చెప్పడంతో అంగీకరించాం.

- తల్లిదండ్రులు లక్ష్మణరావు, శ్రీదేవి



మృతుడు సాయికుమార్ తల్లిదండ్రులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్డీవో దాట్ల కీర్తి, జీవనధాన్ కో-ఆర్డినేటర్ రాంబాబు

పేదలకు ఇళ్ల స్థలం మంజూరు చేయాలి

సాలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభు త్వం పట్టణంలో ఉన్న పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం 2సెంట్లు, గ్రామాల్లో ఉన్న పేదలకు 3 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయా లని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ కోరారు. ఈసందర్భం గా ఆయన గురువారం పలువురితో కలిసి పట్టణంలో కరపత్రాలు విడుదల చేశారు. పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజురు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న అన్ని గ్రామ వార్డు సచివాల యాల వద్ద వ్యక్తిగత అర్జీలు ఇవ్వాలని కోరారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు చూపిస్తున్న సీపీఐ నాయకులు

ఉద్యోగులకు భద్రత కల్పించాలి

● సమ్మె బాటలో 108 ఉద్యోగులు

పాలకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తమను వైద్య ఆరోగ్యశాఖ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, ఈ సర్వీస్ ప్రొవైడర్లు మారినప్పుడల్లా తాము ఆర్థికంగా చితికిపోయామన్నారు. ఈ నెల 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 25వ తేదీ నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెలోకి వెళతామని తెలిపారు. ● సీతంపేట రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ 108 సిబ్బంది ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు జి.అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఓ ప్రకటన ద్వారా వివరాలను వెల్లడించారు. ప్రభుత్వం 108 ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, ఈ సర్వీస్ ప్రొవైడర్‌లు మారినప్పు డు తాము ఆర్థికంగా చితికిపో తున్నామని అన్నారు. 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ● బలిజిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని 108 ఉద్యోగులు రెడ్డి ధనుంజయనాయుడు, సత్యనారాయణ, శంకరరావు, నాగరాజు తదితరులు కోరారు. వారు గురువారం మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని తెలిపారు.



సీతంపేట రూరల్: ఆందోళన చేస్తున్న 108 ఉద్యోగులు

సమస్యల పరిష్కారానికే 'ప్రజా పోరు'

● జిల్లా వ్యాప్తంగా సీపీఎం ధర్నా

బెలగాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపోరు నినాదంతో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక సుందర య్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వ హించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి ఏవోకు వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ నిత్యావ సర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాల ని, ఉచిత ఇసుక పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ● కురుపాం: స్థానిక తహసీ ల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. సీపీఎం మండ ల కార్యదర్శి ఎం.శ్రీను, జిల్లా కార్య దర్శివర్గ సభ్యు డు కొల్లి గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఎన్నికల హామీలను అమ లుపర్చాలని సీపీఎం నాయకులు బీవీ రమణ, కె.రవీంద్రలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు. ● సీతానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయ కులు ధర్నా చేపట్టారు. ● మక్కువ: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సీపీఎం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్ ఆధ్వర్యం లో ధర్నా నిర్వహించారు. ● బలిజిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు మన్మధరావు, గేదెల సత్యనారాయణ ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు.



బెలగాం: కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

న్యూస్ బాక్స్

డీపీవోగా కొండలరావు

పార్వతీపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారిగా టి.కొండలరావు నియామకమయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో డీఎల్‌పీవోగా పనిచేస్తున్న కొండల రావును డీపీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 13న ఆదేశాలు జారీ చేసింది. ఆయన డీపీవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ల నియామకం

పాలకొండ, పార్వతీపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా పాలకొండ నియోజకవర్గానికి చెందిన గండి రామినాయుడు, గర్భాన సత్తిబా బును, కురుపాం నియోజకవర్గానికి చెందిన ఎస్.శేఖర్‌పాత్రుడు కూటమి ప్రభుత్వం నియ మించింది. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గండి రామినాయు డు ప్రస్తుతం టీడీపీ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. గర్భాన సత్తిబాబు జనసేన ఉమ్మడి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉన్నారు.

క్యాన్సర్ పరీక్షలు ప్రారంభం

బలిజిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అన్ని సచివాలయాల్లో 18 ఏళ్లు దాటిన వారందరికీ క్యాన్సర్ పరీక్షలు గురువారం ప్రారంభించారు. బలిజిపేట, నారాయణపురం, నూకలవాడ, పెద్దింపేట, చిలకపల్లి, అంపావల్లి, వంతరాం సచివాలయ పరిధిలో బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్మయి ఆధ్వర్యంలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు.

కార్మికులకు జీతాలు ఇప్పించండి

సాలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్మికులకు తక్షణం బకాయి జీతాలు ఇప్పించా లని సీపీఎం నాయకుడు ఎన్‌వై.నాయుడు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో పలు వురు కార్మికులు గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.